

రేపటి నుంచి బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 11,12,13 తేదీల్లో విజయనగరంలో జరగనున్న అండర్ 14,17,19 బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతం చేయాలని జిల్లా ఉప విద్యా శాఖ అధికారి వాసుదేవరావు, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎల్ వి రమణ తెలిపారు. శనివారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఉన్న ఇండోర్ స్టేడియంలో వ్యాయామ ఉపాధ్యాయులతో పోటీలు కోసం సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు విభాగాల్లో జరిగే బాక్సింగ్ పోటీలకు సుమారుగా 800 మంది వరకు క్రీడాకారులు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలన్నారు. పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలన్నారు. వసతి, భోజన సదుపాయాలలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతోనే పథకాలు

- ప్రపంచస్థాయి రైల్వేస్టేషన్‌గా కొత్తవలస
- వికసిత్ భారత్ సంకల్పయాత్రలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న కేంద్ర రైల్వేశాఖా మంత్రి అశ్విని వైష్ణవ్

ప్రజాశక్తి-వేపాడ

ప్రజల అవసరాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. దేశ ప్రజలందరి సహకారంతో భారత్‌ను 2047 నాటికి అభివద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతోనే ప్రధానమంత్రి నరేంద్రమోడి పనిచేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు వాటిని అర్హులైన వారికి నూరుశాతం అందించే లక్ష్యంతో చేపట్టిన వికసిత్ భారత సంకల్ప యాత్రలో భాగంగా విజయనగరం జిల్లా వేపాడ మండలం వీలుపర్తిలో శనివారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర రైల్వేమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యాన్ని తమ ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఈ సందర్భంగా పిఎం ఉజ్వల యోజన గ్యాస్ పథకం ఎంతమంది అందుకున్నారని కార్యక్రమానికి హాజరైన మహిళలను అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సందర్శించారు. నిక్షయ్ మిత్ర కింద టి.బి.రోగులకు పౌష్టికాహారాన్ని, పిఎం ఉజ్వల యోజన కింద పలువురు లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. పి.బి.సురక్ష బీమాయోజన, ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ స్కీమ్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో భూఆరోగ్య కార్డులు అందజేశారు. స్టాల్‌ను సందర్శించిన కేంద్ర మంత్రికి సెంట్రల్ బ్యూర్ ఆఫ్ కమ్యూనికేషన్స్ అధికారి బి.తారకప్రసాద్ కేంద్ర పథకాల ప్రచార సామాగ్రి గురించి వివరించారు.

ఎస్.కోట నియోజకవర్గానికి రైల్వేమంత్రి వరాలు

కొత్తవలస రైల్వేస్టేషన్ ను ప్రపంచస్థాయి రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దుతామని కేంద్రమంత్రి ప్రకటించారు. కె.కె.లైన్‌ను డబుల్ లైన్‌గా మార్పు చేస్తున్నట్టు చెప్పారు. దీనివల్ల ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు పెరిగి అభివృద్ధి చెందేందుకు మరింత అవకాశం ఏర్పడుతుందన్నారు. విశాఖ-కిరండోల్ ఎక్స్‌ప్రెస్ రైలును ఎస్.కోట రైల్వే స్టేషనులో నిలిపేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులకు కేటాయిస్తున్న నిధులను గణనీయంగా పెంచామని కేంద్ర రైల్వే మంత్రి చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే రాష్ట్రంలో రైల్వేల ప్రాజెక్టుల కోసం రూ.800 బడ్జెట్ కేటాయించగా, విభజన అనంతరం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో రూ.8వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలునాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను మన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తోందన్నారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో నవంబరు 25నుంచి వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 156 గ్రామాల్లో ఈ యాత్ర పూర్తయ్యిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలియజేయడంతోపాటు అర్హులందరికీ శతశాతం అందించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా జీవన ప్రమాణాలు పెంచేందుకు గత నాలుగున్నరేళ్లుగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టాయని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చెప్పారు.

కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్, విశాఖ రైల్వే డిఆర్‌ఎం, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలహాలు మానండి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి • లోక్‌అదాలత్‌లో 1764 కేసులు పరిష్కారం

కక్షిదారులకు ఆహారాన్ని వడ్డిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ్ చక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

కుటుంబ కలహాలతో వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలను దూరం చేసుకోరాదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లోను జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపుకోట, గజపతినగరం, చీపురుపల్లి, కొత్తవలస, కురుపాం కోర్టుల్లో 1,764 కేసులను పరిష్కరించినట్లు ఈ సందర్భంగా జిల్లా జడ్జి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఇటీవల కాలంలో కుటుంబ తగాదాలు ఎక్కువగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనవసర కలహాలుమాని పిల్లల భవిష్యత్ కోసం, మన మీద ఆధార పడ్డవారి కోసం రాజీకి రావాలని హితవు పలికారు. కేసులకోసం పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 1764 కేసులు ఈ సందర్భంగా పరిష్కారమయ్యాయి. విజయనగరంలో 1065, పార్వతీపురంలో 115, బొబ్బిలిలో 134, సాలూరులో 109, శంగవరపుకోటలో 47, గజపతినగరంలో 143, చీపురుపల్లిలో 117, కొత్తవలసలో 34 కేసులు పరిష్కరించారు. 89 మోటార్ ప్రమాదభీమా కేసులను పరిష్కరించారు. కక్షిదారులకు 1కోటి 85లక్షల 95వేల 281 మొత్తాన్ని అందజేయనున్నారు. అదాలత్‌లో జిల్లా న్యాయమూర్తులు జి.రజని, సికెందర్ బాషా, కె.నాగమణి, బిహెచ్‌వి లక్ష్మికుమారి, బి.రమ్య, కె. మోహిడెన్ జమూరుత్ బేగం, హరినాథ శర్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ దామోదర రామ్మోహన రావు, తదితరులు పాల్గొన్నారు. కక్షిదారులకు సౌకర్యార్థం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. న్యాయవాదులు అంజనీ కుమార్, పంపానా రవి కుమార్, పిఎఎస్ రాజు సహకారంతో కక్షి దారులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. జిల్లా న్యాయమూర్తులు స్వయంగా కక్షిదారులకు వడ్డించారు. కార్యక్రమంలో విజయనగరం రూరల్ సిఐ టివి తిరుపతిరావు, వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు, ఎస్ఐ లు గణేష్, భాస్కరరావు పాల్గొన్నారు.

బొబ్బిలి : సత్వర న్యాయం కోసమే జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య జోసెఫైన్ తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మూడు బెంచీలలో లోక్ అదాలత్ నిర్వహించి 134 కేసులను రాజీ చేసి పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంటి గోపాలకృష్ణ శర్మ పాల్గొన్నారు.

రాజాం : రాజాం కోర్టు సముదాయంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, జూనియర్ సివిల్ జడ్జి పిఎస్‌విబి కృష్ణసాయితేజ అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 590 కేసులను పరిష్కరించారు. అందులో క్రిమినల్ కేసులు 509, సివిల్ కేసులు 11, ఎక్సైజ్ కేసులు 58, భార్యాభర్తల తగాదాలు 10, బ్యాంకు పిఎల్‌సిలు 2 ఉన్నాయి. కార్యక్రమంలో సభ్యులు జి.తవుడు, బి.సన్యాసి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కె.రమణమూర్తి, ఉపాధ్యక్షులు డి.భవాని ప్రసాదరావు, ఎపిపి కె.సూర్యకుమార్, ప్రభుత్వ న్యాయవాది ఎస్.పోలారావు, సీనియర్ న్యాయవాది రెడ్డి రామ్మూర్తి, సిఐ రవికుమార్, ఎక్సైజ్ ఎస్ఐ ఎం.శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శంగవరపుకోట : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి అధ్యక్షతన శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 45 కేసులను పరిష్కరించారు. అందులో 28 క్రిమినల్, 8 సివిల్, 9 చెక్ బౌన్స్ కేసులున్నాయి. సివిల్ కేసులకు సంబంధించి కేవలం ప్రాంశరి నోట్ కేసులనే కాకుండా దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న భూమి తగాదాలను కూడా లోక్‌అదాలత్ ద్వారా రాజీచేశారు. కార్యక్రమంలో ఎపిపి పి.కేశవ, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు అల్లు సత్యాజీ, కార్యదర్శి డబ్ల్యు.ఎస్. శర్మ, సీనియర్ న్యాయవాదులు జి.సూరిదేముడు, బి.త్రిమూర్తులు, మామిడి చంద్రశేఖర్, వారాది ఈశ్వరరావు, టి.వి.రమణమూర్తి, బివిఎస్ రామారావు, ఎం.అనూరాధ, సిహెచ్‌ఆర్‌ఎ నాయుడు, ఎం.అప్పారావు, జి.చిట్టిబాబు, ఆర్.సత్యనారాయణ, బి.వెంకటరావు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నరికేసిన టేకు చెట్లను చూపిస్తున్న సిపిఎం మండల కార్యదర్శి రమణ

వాల్టాకు తూట్లు

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇష్టారాజ్యంగా చెట్లు నరికివేత
- చర్యలకు వెనుకాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలో పుణ్యగిరికి వెళ్లే రహదారిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాల్టా చట్టాన్ని ఉల్లంఘించారు. ఇష్టారాజ్యంగా చెట్లు నరికేస్తున్నారు. డిగ్రీ కళాశాలలో నరికేసిన చెట్లను సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ పరిశీలించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని రమణ తెలిపారు. పత్రికా ప్రకటన, టెండర్లు లేకుండా, అటవీశాఖ, రెవెన్యూ అనుమతులు తీసుకోకుండా ఖరీదైన వృక్షాలు కళాశాల ప్రిన్సిపల్ అమ్మేయడం దారుణమన్నారు. రూ.లక్షలు విలువైన చెట్లను డబ్బులకు కక్కుర్తి పడి వేల రూపాయలకు అమ్మేశారని తెలిపారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. కళాశాల విస్తీర్ణం సుమారు 15 ఎకరాలని, ఇప్పటికే కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి, లేఅవుట్లు వేసుకున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక వ్యవస్థలో విద్యార్థుల భాగస్వామ్యం

టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ చంద్రశేఖరన్ ఆకాంక్ష

సమావేశానికి హాజరైన మాట్లాడుతున్న టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్, జిఎంఆర్, తదితరులు

ప్రజాశక్తి-రేగిడి

ఇంజినీరింగ్ విద్యార్థులు పురోగమిస్తున్న దేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు కావాలని, అందుకు నూతన పరిజ్ఞానం వైపు దూసుకువెళ్లాలని టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ పిలుపునిచ్చారు. రాజాంలోని జిఎంఆర్‌ఐటిని శనివారం జిఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావుతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని ప్రణాళికాబద్ధంగా చదివి భారత ఆర్థిక వ్యవస్థల వైపు నడవాలన్నారు. భారత్ ఆర్థిక రంగం అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. టూరిజం, ఫైనాన్స్ సర్వీస్ తదితర రంగాల్లో మంచి ప్రగతి కనిపించిందని చెప్పారు. ఇక్కడ అనుభవం, నిపుణులైన బోధకులు ఉన్నారని, అంకిత భావం సమిష్టి బాధ్యత కనిపిస్తుందని చెప్పారు. రాజాం పట్టణ, పరిసర ప్రాంత ప్రజల కోసం జిఎంఆర్ సంస్థల అధినేత మల్లికార్జున రావు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అమోఘమని కొనియాడారు. ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని కితాబిచ్చారు.

ఈ సందర్భంగా జిఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావు మాట్లాడుతూ సంస్థ ద్వారా చేపడుతున్న పలు సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం జిఎంఆర్ కేర్ ఆస్పత్రిని నారాయణన్ సందర్శించారు. ఎమ్‌డి డాక్టర్ డి.రాజేంద్ర, వైద్యులు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిఎంఆర్ ఎయిర్‌పోర్టు బిజినెస్ చైర్మన్ రాజు, జిఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిజినెస్ చైర్మన్ బివిఎన్ రావు, ప్రముఖ పారిశ్రామికవేత్త నీలాచలం, గ్రంధి చినబాబు, ఫౌండర్ సిఇఒ అశ్విన్ లోహని, సిఇఒ లక్ష్మణమూర్తి, ఎడ్యుకేషన్ డైరెక్టర్ గిరీష్, జిఎంఆర్ ఐటి ప్రిన్సిపల్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట

ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట పడుతుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. శనివారం స్థానిక పిఎసిఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన పంటకు మద్దతుధర కల్పించాలన్నదే ఈ కేంద్రాల ఏర్పాటు ఉద్దేశమన్నారు. రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గోనె సంచులు పిఎసిఎస్‌లో 18 వేల వరకు అందుబాటులో ఉండగా, మరో 20 వేలు సంచులు మిల్లర్లు అందజేస్తారన్నారు. నియోజకవర్గంలో 15 వేల ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, ఏ ఒక్క రైతూ అధైర్యపడవద్దని కోరారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని, అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అంతర పంటలకు కూడా తుపాను కారణంగా నష్టం వాటిల్లిందని చెప్పారు.

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, ఆ పార్టీ నాయకులు చౌకబారు రాజకీయాలు మానుకోవాలని అప్పలనర్సయ్య హితవు పలికారు. చంద్రబాబు హయాంలో తీవ్రమైన కరువు పరిస్థితి ఏర్పడినప్పుడు, తుపాను నష్టానికి ఎటువంటి సహాయమూ చేయలేని చంద్రబాబు, ఇప్పుడు ఏదో చేస్తానంటూ రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు తన ఐదేళ్ల పాలనలో నియోజకవర్గాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, జెడ్‌పిటిసి గార తవుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, ఎడి కె.మహారాజన్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సామంతుల పైడిరాజు, సర్పంచ్ బెల్లాన త్రినాథ్, ఉపసర్పంచ్ మండల సురేష్, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకట్రావు, జెసిఎస్ కన్వీనర్ కనకల సుబ్రమణ్యం, పిఎసిఎస్ సిఇఒ నారాయణరావు, డిటిలు సత్యనారాయణ, రవిశంకర్, వ్యవసాయ అధికారి సిహెచ్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

విద్యుత్‌శాఖ ఇఇపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఉద్యోగుల అక్రమ బదిలీలపై వివరణ కోరిన జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించిన విద్యుత్ శాఖ ఇఇ వివి కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో పాత్రికేయులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద శాఖా పరమైన బదిలీల్లో తనకు అన్యాయం చేశారని, యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది ఆందోళన చేయడంతో దీనికి సంబంధించిన వార్త సేకరణ నిమిత్తం, ఎపిఇపిడిసిఎల్ ఇఇ వి.వి కిషోర్‌ను వివరణ కోరారు. దీంతో ఆయన విలేకర్లపై దురుసుగా ప్రవర్తించి, బయటకు పోవాలని నెట్టి వేసి గట్టిగా కేకలు వేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. అనంతరం శనివారం కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు వినతిపత్రం అందజేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో వివిధ పత్రికలకు, చానళ్ల జర్నలిస్టులు పాల్గొన్నారు.

రాయపూర్ ట్రైన్ టైమింగ్ మార్చాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాయపూర్ ట్రైన్ సమయాన్ని మార్చాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు శనివారం వినతి పత్రం అందజేశారు. జెడ్‌పి చైర్మన్ ను కలిసిన వారిలో చింతాడ రాము, అధ్యక్షులు మన్యం ఆప్టా వైస్ ప్రెసిడెంట్ కె. సత్యారావు, సాధన కమిటీ సభ్యులు రఘు, గణేష్, అప్పారావు, పార్వతీశం ఉన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలో జాజిలి ప్రతిభ

ప్రజాశక్తి-బొబ్బిలి

డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో బొబ్బిలికి చెందిన క్రీడాకారిణి జాజిలి కాంస్య పతకాన్ని కైవశం చేసుకుంది. ఈ మేరకు శనివారం జాజిలిని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ బి.ప్రసాద్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్



కార్యకర్తల కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-భోగాపురం

తుపాను వల్ల నష్టపోయిన రైతులను నేటికీ రాష్ట్రప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమని, వెంటనే రైతులను ఆదుకోవాలని జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. భోగాపురంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో 3వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆత్మహత్య చేసుకున్న రైతుల్లో 570 మంది మహిళా రైతులు ఉన్నారని అన్నారు. పొత్తుల్లో భాగంగా తెలుగుదేశం పార్టీకి గౌరవించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.3500 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వాడుకుందని అన్నారు. తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను నేటికీ గుర్తించక పోవడం దారుణమని అన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు లోకం మాధవి మాట్లాడుతూ నెల్లిమర్ల నియోజకవర్గంలో మైనింగ్ డాన్‌గా స్థానిక ఎమ్మెల్యే ఉన్నారని అన్నారు. నియోజకవర్గంలోని సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని తెలిపారు. తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్ట్ నేటికీ పూర్తి చేయలేకపోయారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో సుమారు 400 కంపెనీలు ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్ కంటే రెండు రెట్లు నియోజకవర్గాన్ని అభివద్ధి చేసి చూపిస్తామన్నారు. మృతి చెందిన ఐదుగురు పార్టీ కార్యకర్తలకు పవన్ కళ్యాణ్ అందజేసిన ఐదు లక్షలు చొప్పున చెక్కులను అందజేశారు. పార్టీ నాయకులు కోన తాతారావు, పంచకర్ల రమేష్ బాబు, పడాల అరుణ, పాలవలస యశస్వి, లోకం ప్రసాద్, గురాన అయ్యలు, ఆదాడమోహన్ రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాదెండ్లను కలిసిన అయ్యలు

విజయనగరం టౌన్ : జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను ఆ పార్టీ నాయకులు గురాన అయ్యలు విశాఖలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా రాజకీయాల గురించి చర్చించారు

పంట నష్ట గణనకు మీనమేషాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పంట నష్ట గణనకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. విజయనగరం ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రం తుపాను నేపథ్యంలో పంటల పరిశీలన పేరిట తెగేసి తిరిగేస్తున్నారు. ఆ పేరుతో తీసుకున్న ఫొటోలు, వీడియోల పరంపర సోషల్ మీడియాలో హల్‌చల్ చేయిస్తున్నాయి. బహుశా రైతులకు అండగా నిలిచామన్న భరోసా ఇవ్వదలచుకున్నారేమో. కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా లేదన్నది రైతుల నుంచి వినిపిస్తున్న మాట. ఇందుకు కారణం లేకపోలేదు. పంటనష్ట గనణపై ఇప్పటి వరకూ ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. దీంతో, వ్యవసాయ శాఖ సిబ్బంది ఆ పనిలో లేరు. కనీసం పంటలు ఎంత మేర నీటిలో మునిగాయన్న అంచనాలు కూడా వ్యవసాయ శాఖ ఇవ్వలేదు. ఇదే విషయాన్ని సాక్షాత్తు వ్యవసాయ శాఖ అధికారులే చెబుతున్నారు. కానీ, రైతుల ఓదార్పు యాత్ర మాత్రం కొనసాగుతోంది. ధ్వంద నీతిని ప్రజలు, ముఖ్యంగా రైతులు గమనిస్తునే ఉన్నారు. పంటనష్ట గణనపై ఇప్పటికీ అధికారులకు ఆదేశాలు అందకపోతే ప్రభుత్వంపై ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మన్ తదితర ప్రజాప్రతినిధులు ఎందుకు ఒత్తిడి చేయడం లేదో అంటూ రైతుల్లో చర్చనడుస్తోంది. కలెక్టర్ మాత్రం 9వ తేదీ నుంచి పంటనష్ట గణన ఉంటుందని చెప్పారు. చెరువులో చేపలు చెల్లిపోయాక కొంగలు వచ్చి ఏం చేస్తాయి అన్న సామెతలా పంటముంపును గుర్తించకుండా, నీరు తగ్గిపోయాక పొల్లాల్లో తలబడి లెక్కించేస్తామంటే నష్టం ఏమిటో ఎలా తెలుస్తుంది అని పలువురు రైతులు, రైతు సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ సంగతి కాస్త పక్కనబెడితే జిల్లాలో తుపాను కారణంగా మూడు రోజులపాటు కురిసిన వర్షాలకు వరి, మొక్కజొన్న, పత్తి, అపసరాల పంటలు నీట మునిగాయి. తీవ్ర నష్టం వాటిల్లింది. వాటిని కాపాడుకునేందుకు రైతుల యాతన వర్ణణాతీతం.



పావలా వాటా కూడా చేతికందే పరిస్థితి లేదని కొందరు, 50శాతానికి మించి చేతికి వచ్చే పరిస్థితి లేదని ఇంకొందరు, ఆయా గ్రామాల్లో వరద ప్రభావాన్ని బట్టి చెబుతున్నారు. మరోవైపు అక్టోబర్‌లో ఏర్పడిన నీటి ఎద్దడి సుమారు లక్ష ఎకరాల్లో పంటలను ఎండబెట్టిన సంగతి తెలిసిందే. దీంతో, రైతుల పెట్టుబడి రెట్టింపు అయినా, దిగుబడి ఆశాజనకంగా వచ్చినా తుపాను వేసిన కాటుకు సగానికి సగం కూడా చేతికి అందని పరిస్థితి దాపురించింది. నీటి ఎద్దడి ఎదుర్కొన్న సమయంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల నోట కరువు జిల్లాగా ప్రకటించాలన్న మాట రాలేదు. ఇప్పుడు పంటనష్ట గణనకు మీనమీషాలు లెక్కిస్తున్నా రైతుల ఆర్తనాదాలు ప్రభుత్వ చెవులకు ఎక్కించే ప్రయత్నం చేయలేదు. దీంతో, రైతుల పట్ల మొసలి కన్నీరు కార్చడం తప్ప రైతులకు మేలు చేసేందుకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఏమాత్రం ఒత్తిడి చేయలేదని, ప్రభుత్వం చెబుతున్న సాంతికేక కారణాల సాకులకు తలూపడమే మిగిలిందని జనం చర్చించుకుంటున్నారు. పైగా కోత కోసిన వరిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోబోదంటూ సాక్షాత్తు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాజన్నదొర చేసిన ప్రకటన రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. వాస్తవానికి ఇప్పటికే 70శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ఇందులోనూ ఎక్కువ భాగం ఇంకా పొలాల్లోనే ఉంది. అపార నష్టం వాటిల్లింది. తమకు బాధ్యత లేదన్నట్టు ప్రభుత్వం వ్యవహరించడం వెనుక రైతులను పంగనామాలు చూపించేందుకు ప్రయత్నించడమేనని పలువురు చర్చించుకుంటున్నారు. ఇదే జరిగితే ప్రభుత్వానికి రైతులే తగిన గుణపాఠం చెబుతారని జనం నోట వినిపిస్తున్న మాట.

ప్రశంసాపత్రాలు, పతకాలతో విద్యార్థులు

కుమిలి విద్యార్థులకు పతకాల పంట

ప్రజాశక్తి - పూసపాటిరేగ

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో మండలంలోని కుమిలి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పతకాల పంట పండింది. 15 మంది విద్యార్థులు పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు శనివారం ఉపసర్పంచి గుజ్జు సురేష్‌రెడ్డి, గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మంచి తర్ఫీదు ఇస్తున్న పీడీలు కమలనాభరావు, బంగార్రాజును అభినందించారు.

అచ్చెన్నను కలిసిన నర్సింగరావు

ప్రజాశక్తి- విజయనగరం కోట

అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నర్సింగరావు

తనను మాడుగుల నియోజకవర్గ రాష్ట్ర పార్టీ పరిశీలకుడిగా నియమించిన సందర్భంగా కర్రోతు వెంకట నర్సింగరావు శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి పార్టీ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అచ్చెం నాయుడు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని తెలిపారు. అనంతరం నరసింగరావు మాట్లాడుతూ తన శక్తివంతం మేరకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి విజయనగరం నియోజకవర్గ కార్యాలయం ఏర్పాటుచేసి నాలుగో ఏడాదిలో అడుగుపెడుతున్న సందర్భంగా శనివారం పార్టీ కార్యకర్తలకు ,అభిమానులకు మాజీ ఎమ్మెల్యే మీసాల గీత మిఠాయిలు పంచిపెట్టారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి గల అంశాలపై పార్టీ కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు కార్యక్రమంలో ఎస్ఎన్ఎం రాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సైలాడ త్రినాథ్ , మాజీ జెడ్పిటిసి తుంపిల్లి రమణ , దాట్ల రవి రాజు, మాజీ కౌన్సిలర్ రొంగలి రామారావు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- విజయనగరంటౌన్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల కోసం క్రీడాకారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న కిట్లను మాజీ ఎం.పి. బొత్స ఝాన్సీ లక్ష్మి శనివారం అందజేశారు. రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కిట్లను ఆమె అందజేశారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ అచ్యుత్ కుమార్, క్రీడా ప్రాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడం, వారి శక్తి సామర్థ్యాలు గుర్తించి వారు క్రీడల్లో మరింతగా రాణించేలా తీర్చిదిద్దాలని అన్నారు.

ఇంటింటి ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు పాలవలస గౌరు

గదబవలసలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని బొత్సవానివలస పంచాయతీ గదబవలస, ఎరుకులపాకలు గ్రామాల్లో శనివారం బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఎంపిటిసి పాలవలస గౌరు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టోను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎఐసిసి మాజీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పిసిసి సభ్యులు ముద్దల శ్రీనివాసరావు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి జి.శశిభూషణరావు, కాంగ్రెస్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, పద్మ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ఎఐసిసి మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు ఎస్.రమేష్ కుమార్ కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాలుగు మండలాల అధ్యక్షులు కనకల పద్మనాభం, తెలుగు సూరిబాబు, గురువులు, రమణ, నాయకులు అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట : ఎఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విజయనగరం నియోజకవర్గ అధ్యక్షులు సుంకరి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ప్రేమ సమాజంలో వృద్ధులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్ చేతులమీదుగా వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ వైస్ చైర్మన్ ఎమ్‌డి హసన్ షరీఫ్, నూర్జహాన్ బేగం, రెహమాన్, మోహన్ రావు, రాజేష్, చంద్రశేఖర్, సూరి బాబు, శ్రీను పాల్గొన్నారు.

అవినీతి రహిత దేశంగా తీర్చిదిద్దుదాం

ప్రజాశక్తి-బొబ్బిలి

అవినీతి రహిత దేశంగా తీర్చిదిద్దుదామని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ అన్నారు. అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం రఘు జూనియర్ కళాశాలలో అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి వల్లే దేశం అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. అవినీతికి వ్యతిరేకంగా యువత, విద్యార్థులు పోరాటం చేయాలని కోరారు.

పాఠశాల నిర్వహణ నిధులు బదిలీ చేయాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వ పాఠశాలలకు వచ్చిన నిర్వహణ నిధులు బదిలీ చేయాలని ఎంఇఒలు యు.సూర్యనారాయణ మూర్తి, ఇ.విజయ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక విద్యా శాఖ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల హెచ్‌ఎంలు, ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చిన నిర్వహణ నిధులను జిల్లా అధికారులు ప్రతిపాదించిన మేరకు వేరే జిల్లాల పాఠశాలలకు ఆన్‌లైన్‌లో బదిలీ చేయాలని తెలిపారు. నాడు-నేడు ఫేస్ -1లో ఉన్న పాఠశాలలకు వచ్చిన ఎస్ఎంఎఫ్ నిధులు కేటాయించినట్లు చెప్పారు. కచ్చితమైన సమాచారంతో ఈ ఏడాది యూ డైస్‌ను నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్, ఎంఆర్‌సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువతరం పుస్తకాలు చదవాలి

ప్రజాశక్తి-చీపురుపల్లి

యువత పుస్తకాలు చదవి సమాజాన్ని అర్థం చేసుకోవాలని ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ అన్నారు. చీపురుపల్లి సత్యరామా డిగ్రీ కాలేజ్ అవరణంలో ఆశయ రూరల్ లైబ్రరీ, ఆశయ యూత్ అసోషియేషన్ వారి ఆధ్వర్యంలో మొబైల్ బైక్ లైబ్రరీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ విద్యార్థులకు యువత పుస్తక పఠనం పై అవగాహన కల్పించడం, పుస్తకాలు ఇచ్చి చదివించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ ఏడాది నుంచి 12 పాఠశాలలను, కళాశాలలను దత్తత తీసుకొని, మరియు కాలేజ్ దత్తత తీసుకుని ఒక రోజు మొబైల్ లైబ్రరీ వెళ్లి వారితో ఒక రోజు పుస్తకాలు చదివిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ ముకుందరావు, అధ్యాపకులు ఎం. లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు

గిరిజనాభివృద్ధికి వారధి

- గిరిజన, మైదాన ప్రాంతాల మధ్య వంతెనలు
- దశాబ్దాల ఏజెన్సీ వాసుల కష్టాలకు తెర
- అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు మార్గం

ప్రజాశక్తి - సాలూరు

మోసూరు వంతెన

మండలంలోని కందులపథం వంతెన లేక ఆ ప్రాంతంలో ఉన్న భూస్వాములు, గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో కాజ్‌వే మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి వుండేది. సుమారు 20 గిరిజన గ్రామాలకు వారధిగా ఉండేలా వంతెన నిర్మాణమైంది. రూ.5.5 కోట్లతో పంచాయతీ రాజ్ ప్రాజెక్ట్ పర్యవేక్షణలో వంతెన నిర్మించడంతో రవాణాతో పాటు రాకపోకలు సాగిస్తున్నారు. పామాయిల్, మొక్కజొన్న, పత్తి వంటి వాణిజ్య పంటలతో పాటు అటవీ ఉత్పత్తుల రవాణా ఇప్పుడు సులువైంది. ఏడాది క్రితం డిప్యూటీ సిఎం రాజన్నదొర ఈ వంతెనను ప్రారంభించారు. సుమారు వంద కోట్ల రూపాయల నిధులతో వంతెనలు, కాజ్‌వేల నిర్మాణం జరుగుతోంది. వీటిలో కొన్ని పూర్తవ్వగా, మరికొన్ని నిర్మాణదశలో ఉన్నాయి. సాలూరు పట్టణానికి సమీపంలో ఉన్న కాకులతోట వద్ద వట్టిగెడ్డ నదిపై వంతెన నిర్మాణంలో ఉంది. 80శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ వంతెన నిర్మాణంతో సాలూరు, పాచిపెంట మండలంలోని ఎక్కువ గిరిజన గ్రామాలకు రవాణా కష్టాలు తీరిపోయే అవకాశం ఉంది. వర్షాకాలంతో కాజ్‌వే మీదుగా ప్రయాణించాలంటే వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వాహనాలు నడిపేవారు. వంతెన నిర్మాణానికి ముందు ఎంతోమంది నదిలో స్నానానికి వెళ్లి కొట్టుకుపోయారు. అలాంటి పరిస్థితి నుంచి ఈరోజు రాకపోకలు సాగించేందుకు వంతెన సిద్ధంగా ఉంది. పిఆర్ ప్రాజెక్ట్ శాఖ పర్యవేక్షణలో రూ.50కోట్లతో పది వంతెనల నిర్మాణం జరుగుతోంది. పాచిపెంట మండలం మాతుమూరు -శీల గ్రామాల మధ్య రూ.9.8కోట్లతో వంతెన నిర్మాణంలో ఉంది. అదే రహదారిలో మరోచోట రూ.4.85కోట్లతో వంతెన నిర్మాణం సాగుతోంది. మోసూరుకు రాకపోకలు సాగించే రహదారి మధ్యలో వట్టిగెడ్డపై రూ.7.6కోట్లతో వంతెన నిర్మాణమైంది. కుంతాం రోడ్డు నుంచి మెట్టుగుడ్డి, శేరిగుడ్డి వెళ్లే దారిలో రూ.5.75కోట్లతో తుమ్మిగెడ్డపై వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అదే దారిలో మరోచోట రూ.1.93 కోట్లతో వంతెన నిర్మాణం పూర్తయింది. ఆలూరు నుంచి గాదిలమండ వెళ్లే రహదారిలో రూ.7.45 కోట్లతో వంతెన నిర్మాణం సాగుతోంది. సాలూరు మండలంలో వెలగవలస, ములక్కాయవలస గ్రామాల మధ్య రహదారిలో రూ.8కోట్లతో వంతెన నిర్మాణంలో ఉంది. చినబోరబంద రోడ్డు నుంచి పారన్నవలస రహదారిలో రూ.1.38కోట్లతో కాజ్‌వే నిర్మాణపనులు జరుగుతున్నాయి. దండిగాం నుంచి కురుకుట్టి వెళ్లే రహదారిలో కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన పనులు టెండర్ దశలో ఉన్నాయి. భారీ వర్షాలు పడినప్పుడల్లా దండిగాం, కురుకుట్టి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ఏజెన్సీ ప్రాంతంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి జాడలు కనిపిస్తుండడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వంతెనల నిర్మాణం వల్ల అటవీ ఉత్పత్తుల రవాణాకు అడ్డంకులు తొలగిపోయాయనే అభిప్రాయంతో ఉన్నారు.

నియోజకవర్గంలో గిరిజన, మైదాన ప్రాంతాల మధ్య రహదారుల్లో వాగులు, వంకలు, నదులపై వంతెనల నిర్మాణంతో దశాబ్దాల రవాణా కష్టాలకు తెర పడింది. ఏజెన్సీ గ్రామాలను కలుపుతూ ఏర్పడిన రహదారుల మధ్యలో వంతెనలు, కాజ్‌వేలు లేక గిరిజనులు, మైదాన ప్రాంత రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉండేది. అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసుకోలేక గిరిపుత్రులు వాటిని గ్రామాల్లోనే తక్కువ ధరలకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి కనిపించేది. అలాంటి దుస్థితి నుంచి గిరిజనులు సులభంగా తమ అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా చేసుకునేందుకు మార్గం సుగమమైంది.

సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత

డిప్యూటీ సిఎం రాజన్నదొర

నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనులు కూడా త్వరితగతిన జరుగుతున్నాయి. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్నడూ జరగని అభివృద్ధి పనులు ఇప్పుడు కనిపిస్తున్నాయి. రూ.వంద కోట్లపైనే నిధులతో వంతెనలు కాజ్ వేలు నిర్మాణంలో ఉన్నాయి. దశాబ్దాల రహదారి కష్టాలకు వంతెనల నిర్మాణంతో తెరపడుతుంది.

రైతులకు నష్టపరిహారం అందించాలి

బొండపల్లి.. దెబ్బతిన్న వరిచేనును పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-బొండపల్లి

తుపానుతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం తక్షణం చెల్లించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ కోరారు. శనివారం మండలంలోని గెద్దపేట గ్రామంలో నీటిలో మొలకెత్తిన పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పంట నష్టంపై గోడు వినిపించారు. ఇప్పటికీ వరి కుప్పలు నీటిలో మునిగి ఉన్నాయని, చాలా వరకు ధాన్యం మొలకెత్తి రైతుకు తీవ్ర నష్టాన్ని కల్గించాయని శివరామకృష్ణ అన్నారు. ప్రభుత్వం ఆర్భాటంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని, క్షేత్ర స్థాయిలో వరి పంట నష్టాన్ని అంచనా వేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అధికారులు పూర్తిగా పాడైన, నేలమట్టమైన పంటలకే నష్టపరిహారం అందిస్తామని చెప్పడం వల్ల రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఎరువులు, విత్తనాలు, నష్టపరిహారం కూడా అందజేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు, మండల అధ్యక్షులు కరణం భాస్కరరావు, ఉపాధ్యక్షులు సిరిపురం శ్రీనివాసరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు వసంతల తిరుపతిరావు, నాయకులు చింతల చిన్నమ్మ తల్లి, వసంతల సన్యాసినాయుడు, వసంతల వెంకట్రావు పాల్గొన్నారు.

రామభద్రపురం : తుపాను ప్రభావం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పారదర్శకంగా నష్టపరిహారం పంపిణీ చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీనాయన కోరారు. శనివారం రామభద్రపురంలో వరి, కూరగాయలు, పత్తి పంటలను ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వందలాది ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. తుపానుతో నష్టపోయిన బాధితులకు సహాయక చర్యలు చేపట్టడంలో

రైతులతో మాట్లాడుతున్న ఎఒ నీలిమ

1800 ఎకరాల్లో పంటనష్టం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలో సుమారు 1800 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారి నీలిమ తెలిపారు. మండలంలో పంట నష్టాన్ని శనివారం ఆమె పరిశీలించి, రైతులతో మాట్లాడారు. మండలంలోని 4900 వరకూ వరి పంట సాగయ్యిందని ఎఒ తెలిపారు. పంట కోతకొచ్చే సమయంలో తుపాను రావడంతో వరిపంట నేలపాలైందని చెప్పారు. తుపాను వస్తుందని ముందుగా హెచ్చరించినా, కోతలు కోయడం వల్ల ఈ నష్టం వాటిల్లిందన్నారు. సుమారుగా వెయ్యి ఎకరాల్లో గాలిదిబ్బలు నీటమునిగాయని వివరించారు. సుమారుగా 400 ఎకరాలు పనలు పొలంలోనే ఉండిపోవడంతో నీటిలో మునిగిపోయాయని తెలిపారు. 400 ఎకరాలు పూర్తిగా పోయినట్లేనని చెప్పారు. మరో 400 ఎకరాలు వరకూ పండిన పంట నేలకొరిగిందని తెలిపారు. ఈ పంట మరలా లేవదని, అది కూడా మొలకెత్తే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతానికి తమ దృష్టికి వచ్చింది సుమారు 1800 ఉంటుందని, మరికొంత పెరిగే అవకాశం ఉందని, సర్వే పూర్తయ్యాక పూర్తివివరాలు తెలియజేస్తామని వెల్లడించారు. రెల్లివలస, కుమిలి, లంకలపల్లిపాలెం, కొప్పెర్ల, వెంపడాం, గుంపాం తదితర ప్రాంతాల్లో ఎక్కువ నష్టం వాటిల్లిందని వివరించారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

'గడపగడపకు'తో సమస్యలకు పరిష్కారం

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బాడంగి

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. శనివారం మండలంలోని కోడూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు గురించి ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాలని అధికారులకు సూచించారు. ఎవరికైనా పథకాలు అందకుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రామారావు, వైసిపి నాయకులు తెంటు మధు, మరిపి శంకర్‌రావు, రెడ్డి కృష్ణ, మరిపి రమేష్, తెంటు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల అక్రమాలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, బొబ్బిలి, బాడంగి మండలాల కార్యదర్శులు ఎస్.గోపాలం, ఎ.సురేష్ డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణకు గురైన ఇళ్ల స్థలాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో అధికార పార్టీకి చెందిన వార్డు ఇన్‌ఛార్జి ఇళ్ల స్థలాలను ఆక్రమించేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు అక్రమాలపై దర్యాప్తు చేసిన రెవెన్యూ అధికారులపై అధికార పార్టీ నేతలు ఒత్తిడి తేవడంతో అర్ధాతరంగా దర్యాప్తు నిలిపివేశారని మండిపడ్డారు. గతంలో పేదలకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేయకపోవడంతో ఆ స్థలాలను రద్దు చేసినట్లు గృహ నిర్మాణ శాఖాధికారులు చెప్పారని, ఆ స్థలాలను ఇప్పుడు కాలనీకి చెందిన కొంతమందితో కలిసి ఆక్రమించేసి ఒక్కొక్కటి రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు అమ్ముకుంటున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఇళ్ల స్థలాల అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పూలమొక్కలతో విద్యార్థులు

సరికొత్త మెలకువలతో విద్యాబోధన

ప్రజాశక్తి-మెరకముడిదాం

సరికొత్త మెలికువలతో విద్యార్థులకు విద్యా బోధన అందించటం ఆ పాఠశాలకే సొంతం. అదే మెరక ముడిదాం మండల కేంద్రంలో ఉన్న సన్ రైజ్ పాఠశాల. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అందులో ప్రథమ ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు పూల మొక్కలు అందించారు. తద్వారా పర్యావారణాన్ని మొక్కలు పెంచటం ద్వారా పరిరక్షించాలని సూచించారు. మొక్కల నుంచి మొగ్గలు ఏర్పడి ఆ మొగ్గలు వికసించి పువ్వులుగా ఎలా మారుతాయో విద్యార్థులు కూడా విద్యలో వికసించి ప్రయోజకులు కావాలని పాఠశాల మేనేజ్ మెంట్, ఉపాధ్యాయులు సూచించారు.

విద్యార్థులకు గణిత పోటీలు

ప్రజాశక్తి-వంగర

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

జాతీయ గణిత దినోత్సవ వేడుకలను పురస్క రించుకొని ఎపిఎం ఎఫ్ , చిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ద్వారా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి గణిత పోటీలు శనివారం నిర్వహించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముద్దాడ రమణమ్మ తెలిపారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలల కు చెందిన జూనియర్, సీనియర్ విభాగాల నుంచి మొత్తం 11 టీంలు హాజరు కాగా ఇందులో జూనియర్ విభాగంలో మొదటి బహుమతి వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ద్వితీయ బహుమతి మరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తృతీయ బహుమతి ఎంఎస్ఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు, సీనియర్ విభాగంలో మొదటి బహుమతి వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రెండవ బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అరసాడ, మూడవ బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంఎస్ఆర్ పురం విద్యార్థులు గెలుపొందారు. వీరికి వంగర మరువాడ కోనంగిపాడు ప్రధాన ఉపాధ్యాయులు ఎం రమణమ్మ, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు ముగ్గురు ఎంపిక

మండల స్థాయి గణిత పోటీల్లో గెలుపొందిన ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వంగర జెడ్‌పి ఉన్నత పాఠశాల నుండి కె.తులసి, బి.ప్రతాప్, అరసాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల నుండి ఎల్.లోకేశ్వరి ఎంపిక కావడంతో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మహారాజశ్రీ విజయనగరం IInd Addl. జూనియర్ సివిల్ జడ్జి కమ్ స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో

OS 714/2021

Between:
శ్రీ కడగల వెంకటనారాయణ ......వాది
And:
1. శ్రీ తిప్పాన రాజారావు
2. శ్రీమతి తిప్పాన సన్యాసమ్మ ....ప్రతివాద్లు

D1. శ్రీ తిప్పాన రాజారావు S/o కృష్ణ, పూసపాటిరేగ గ్రామం మరియు మండలం, విజయనగరం జిల్లా
D2. శ్రీమతి తిప్పాన సన్యాసమ్మ W/o రాజారావు rest - do - ditto

పై నెంబరు దావాలో ప్రతివాదిగారు మీపై వేసిన దావాలో నోటీసు నిమిత్తం తే 27-12-2023దీకి వాయిదా వేసియున్నారు. శ్రీ కోర్టువారు ఆర్డరు ప్రకారం నోటీసు సమన్లు జారీ చేయు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది. పై నెంబరు దావా నోటీసు నిమిత్తం **తే 27-12-2023దీ గం॥ 10-30ని॥**లకు పై కోర్టులో మీరుగాని మీ తరుపున వకీలు గారి ద్వారాగాని హాజరు అయి మీ తరుపున వాదన తెలియపర్చుకొనవలసినదిగా యిందుమూలంగా తెలియజేయడమైనది. లేనిచో మీ పరోక్షమున తీర్మాణం చేయడమగునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

కె.రమేష్
జె.కన్నంనాయుడు
వాది తరుపున అడ్వకేట్లు
విజయనగరం